క్లుప్తంగా

వైభవంగా పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ శ్రీ ఛత్రగిరి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేసి వీధుల్లో ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డీజేకు అనుమతి లేదు

కందుకూరు: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో డీజే వినియోగంపై నిషేధం విధించినట్లు సీఐ సీతారామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధ ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చిన్న పిల్లలకు శాశ్వత వినికిడి సమస్య ఏర్పడే అవకాశం ఉన్నట్లు పరిశోధనలు తెలియజేస్తున్నాయన్నారు. ఎవరైనా డీజే ఏర్పాటు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. సంబంధికులపై కేసులు పెట్టాల్సి వస్తోందని హెచ్చరించారు. డీజే పెట్టకుండా అందరూ నియంత్రణ పాటించి బతుకమ్మ సంబురాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.

డిప్యూటీ ఇంజినీర్‌గా భార్గవ్‌రెడ్డి



తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజినీర్‌గా(ఏఈ)గా పని చేస్తున్న కంచర్ల భార్గవ్‌రెడ్డి డిప్యూటీ ఇంజినీర్‌గా(డీఈ)గా పదోన్నతి పొందారు. 2016లో పబ్లిక్ హెల్త్ విభాగంలో ఏఈగా ఉద్యోగం పొందిన భార్గవ్‌రెడ్డి నాగర్‌కర్నూల్ స్పెషల్ ప్రాజెక్టు ఏఈగా, ఆమనగల్లు, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో ఏఈగా పనిచేశారు. డీఈగా పదోన్నతి పొంది జీహెచ్ఎంసీ విభాగంలో చేరారు. పదోన్నతిపై మున్సిపాలిటీ అధికారులు, పాలకమండలి సభ్యులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు.

పేద బ్రాహ్మణ విద్యార్థులకు సాయం



విద్యార్థికి నగదు అందజేస్తున్న సంఘం సభ్యులు

మీర్‌పేట: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రముఖ విద్యావేత్త భాష్యం సుబ్రమణ్య శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎన్‌బీఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన మీర్‌పేట శ్రీ గాయత్రీ సేవా సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీగాయత్రీ విద్యార్థి సహాయ పథకం కింద 15 మంది అర్హులైన పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివరామప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటసత్యనారాయణమూర్తి, రామచంద్రారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసప్రసాద్, కోశాధికారి సత్యసూర్య బాపిరాజు, సంయుక్త కార్యదర్శులు శివరామకృష్ణ, అందుకూరి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య హోమం



భక్తులకు ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్ కుమార్‌జోషి

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో బుధవారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేకంగా హోమాన్ని నిర్వహించారు. పూర్ణాహుతి చేసి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం, ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. ప్రతి నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి సేవలో గడపాలన్నారు. దీంతో ఆధునిక సమాజంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకొని నిలబడే శక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



మహేశ్వరం: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శైలజ, పంచాయతీ కార్యదర్శులు



మహేశ్వరం: గ్రామ పంచాయతీ కార్యాలయంలో..



కందుకూరు: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి

గాంధీ సేవలు మరువలేనివి

మీర్‌పేట: మీర్‌పేట చందన చెరువు కట్టపై గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.



మీర్‌పేట: నివాళులర్పిస్తున్న మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి తదితరులు

మహేశ్వరం: దేశ స్వాతంత్య్ర పోరాటంలో మహాత్మ గాంధీ పాత్ర కీలకమని ఎంపీడీవో శైలజ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గాంధీ సిద్ధాంతాలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, సరికొండ పాండు, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సొడపు వెంకటేశ్‌గౌడ్, చిర్ర సాయిలు, గుండ్ర సుధాకర్‌రెడ్డి, కె.విఘ్నేశ్వర్‌రెడ్డి, సరికొండ జగన్, సురసాని రాంరెడ్డి, జగదీశ్, కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, అనేగోని పాండుగౌడ్, మంద సాయిలు, వరికుప్పల బాబు, రూప్లానాయక్, నిమ్మ రాజశేఖర్‌రెడ్డి, నవీన్, వంశీ, గాదె కుమార్, ఎడ్ల నర్సింహ, కందడి శ్రీశైలం, జగన్‌రెడ్డి, శ్రీనుగౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ తాజుద్దీన్, సిబ్బంది మహాలక్ష్మి, అజయ్, శంకర్, దశరథ పాల్గొన్నారు.



తుక్కుగూడ: మున్సిపల్ సిబ్బందిని సన్మానిస్తున్న కౌన్సిలర్లు, అధికారులు



కందుకూరు ఎంపీడీవో కార్యాలయంలో..



కందుకూరు: నేదునూరులో..



కందుకూరు: కొత్తూర్‌లో..

మైసమ్మ ఆలయంలో అన్నదానం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథ ఆలయంలో బుధవారం 500 మంది భక్తులకు ఆర్యవైశ్య (వాకర్స్ గ్రూప్) సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వాకర్స్ టీం సభ్యులు ఎన్టీఆర్ కృష్ణ, నగేశ్‌గుప్తా, కూర శ్రీనివాస్ గుప్తా, చోలే ఆనంద్‌గుప్తా, పీవీటీ మార్కెట్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కై రంకొండ ధనుంజయ నేత, మల్లికార్జున నేత, కర్మాన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ బోర్డు మెంబర్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌లు హాజరై అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడేళ్లగా ఆలయంలో ప్రతి రోజు 200 మందికి, అమావాస్య రోజు దాతల సహాయంతో 500 మందికి అన్నదానం చేస్తున్నామని తెలిపారు. సరూర్‌నగర్ పట్టణ చరిత్రలోనే ఒక గొప్ప సంకల్పంతో బంగారు మైసమ్మ దేవాలయ కమిటీ కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. హిందూ దేవాలయాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్‌లు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రైతు ధర్నాను విజయవంతం చేయండి



కందుకూరులో సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు: రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ ఈ నెల 5వ తేదీన కందుకూరు చౌరస్తాలో నిర్వహించనున్న రైతు ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆ పార్టీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే రైతుధర్నాకు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సక్రమంగా చేయని రుణమాఫీ, రైతు భరోసా తదితర సమస్యలపై ధర్నా కొనసాగనుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రికి ఏర్పాట్లు పూర్తి

నేటి నుంచి తొమ్మిదిరోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు

తుక్కుగూడ: విజయ దశమి సందర్భంగా మున్సిపాలిటీ వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకుగాను మండపాలను ఏర్పాటు చేసి, అత్యంత సుందరంగా విద్యుత్ కాంతులను అలమరుస్తున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రతిమలను తీసుకొచ్చారు. నేడు ప్రత్యేక పూజ చేసి ప్రతిష్ఠించిన అమ్మవారికి రోజుకో అలంకరణతో తొమ్మిదిరోజుల పాటు పూజలు చేయనున్నారు.



రావిర్యాలలో ఏర్పాటు చేసిన మండపం

స్నేహితుడి కుటుంబానికి అండగా..



బాధిత కుటుంబానికి డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు: అకాల మరణం చెందిన తమతో పాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు పూర్వ విద్యార్థులు. మండల పరిధిలోని లేమూరుకు చెందిన గుల్వి శేఖర్ జూలై 17న మృతి చెందాడు. అతనికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దీంతో అతనితో పాటు ఆ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల 2007–08 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. అందరూ కలిసి రూ.1లక్ష జమ చేసి స్నేహితుడి కుటుంబ సభ్యుల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాన్ని బుధవారం అతని భార్యకు ఇచ్చారు. పిల్లల చదువులకు తాము సహాయం చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, శ్రీనివాస్, కృష్ణ, శ్రీశైలం, నరేశ్ కుమార్, నవీన్‌కుమార్, రవీందర్, నరేశ్‌బాబు, సంధ్యారాణి, జంగయ్య, బాబు, సదానంద్, అశోక్, నాగార్జున, శేఖర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

షాద్‌నగర్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఏఐఎస్‌ఎఫ్ షాద్‌నగర్ నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అన్నారు. నాటి నుంచి నేటివరకు దేశ వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విద్యను కాషాయికరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసేందుకు నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, తెలంగాణ విభజన హామీలను అమలు చేయకుండా ఈ ప్రాంత విద్యార్థుల పట్ల కక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగం పట్ల చేసిన నిర్లక్ష్యం కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కౌన్సిల్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కౌన్సిల్ అధ్యక్షుడిగా నరేశ్, కార్యదర్శిగా విజయ్, ఉపాధ్యక్షుడిగా రమేశ్, పూజ, సహాయ కార్యదర్శులుగా తరుణ్, నందిని, కోశాధికారిగా సాయితో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

మద్యం విక్రయాలు నిలిపివేయాలి

పంచాయతీ కార్యదర్శికి వినతి

షాద్‌నగర్‌రూరల్: గ్రామంలో మద్యం విక్రయాలను నిలిపివేయాలని వెలిజర్ల గ్రామస్తులు బుధవారం కార్యదర్శి యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, పరిమితికి మించి బెల్టుషాపులను నడుపుతున్నారన్నారు. గ్రామంలో మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. ఉదయం 4గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని, నిర్వాహకులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా మద్యం విక్రయాలను చేపడుతున్నారని ఆరోపించారు. అధికారుల అండదండలతోనే మద్యాన్ని అమ్ముతున్నారని, బెల్టుషాపు నిర్వాహకుల అరాచకాలు తీవ్రంగా మారాయన్నారు. మైనర్లకు మద్యం విక్రయించొద్దని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాన్ని మద్యం రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్టుషాపులను కట్టడి చేయాలని కోరుతున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంబేడ్కర్ సంఘం యూత్ అధ్యక్షుడు జంగయ్య, దొడ్డి శ్రీనివాస్, కుమార్, వెంకటేశ్, ప్రవీణ్, కృష్ణ, శ్రీశైలం, రమేశ్, జంగయ్య, నరేశ్, బాబు, జంగయ్య తదితరులు ఉన్నారు.

శ్రీరామ రామ ఉయ్యాలో..

మహేశ్వరం నియోజకవర్గంలో ఎంగిలి పూల బతుకమ్మ సంబురాలను బుధవారం సాయంత్రం మహిళలు ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఇళ్ల ముంగిట, అనంతరం దేవాలయాల వద్ద ఒక దగ్గరకు చేరి మహిళలు రామ రామ ఉయ్యాలో.. అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. దీంతో గ్రామాల్లో సందడితో పాటు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



కందుకూరు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కందుకూరు: కొత్తగూడ చౌరస్తాలో..



మహేశ్వరం: బతుకమ్మలతో మహిళలు

గ్రామాభివృద్ధికి సహకరించాలి

ప్రత్యేక అధికారి అనురాధ

మొయినాబాద్‌రూరల్: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని మండల వ్యవసాయ అధికారి, హిమాయత్‌నగర్ ప్రత్యేక అధికారి అనురాధ పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ జీపీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి గ్రామస్తులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాధ పాల్గొని మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికీ చేరేందుకు కృషి చేస్తామని తెలిపారు. హిమాయత్‌నగర్ గ్రామంలోని సర్వే నెంబర్ 3 పక్కన గ్రామకంఠ స్థలం ఉందని, ఇందులో గతంలో మాజీ సర్పంచ్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మించాలని తీర్మానించారన్నారు. ఫంక్షన్ హాల్ నిర్మించకపోతే ఓల్డేజ్ ఆశ్రమం ఏర్పాటు చేయాలని, లేకపోతే, ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గ్రామసభలో తీర్మానించారని గుర్తు చేశారు.

వర్మీకంపోస్టు ఎరువులతో ఉపయోగం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: భూసారం పెంపు, నాణ్యమైన పంటలు, కాలుష్య నివారణకు వర్మీకంపోస్టు ఎరువు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణ శివారులోని సీఎస్‌కే వెంచర్ సమీపంలో ఉన్న డంప్‌యార్డులో వ్యర్థాల నుంచి ఎరువులు, దాణా తయారీ యూనిట్ పైలెట్ ప్రాజెక్టును బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రసాయన ఎరువులతో సాగుచేసే భూములు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయన్నారు. రసాయనాలకు బదులుగా వర్మీకంపోస్టు ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పట్టణంలో మున్సిపాలిటీ వారి ఆధ్వర్యంలో అనునిత్యం ప్రతి ఇంటి నుంచి చెత్త, కుళ్లిన కూరగాయలు, సేకరిస్తున్నారన్నారు. సేకరించిన కూరగాయల వ్యర్థాల నుంచి వర్మీకంపోస్టు, కోళ్లు, చేపలకు సంబంధించిన దాణా తయారుచేసే విధంగా యూనిట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యర్థాల నుంచి సంపదను సృష్టిస్తూ మున్సిపాలిటీ ఆదాయ మార్గాలు పెంచే విధంగా ఎరువుల తయారీ యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న పాల్గొన్నారు.



నాగారంలో బతుకమ్మలతో యువతులు



తుక్కుగూడ: బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386